మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

జిల్లా వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరచాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి5: జిల్లాకు సంబంధించిన పథకాలు, ఉద్యోగ ప్రకటనల పూర్తి సమాచారాన్ని జిల్లా వెబ్ సైట్‌లో పొందుపర్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్లు అరుణ శ్రీ, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా అధికారులు అందించే సమాచారాన్ని ప్రతి సోమవారం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. జిల్లా అధికారులు తమ కార్యాలయం ద్వారా నిర్వహించే పథకాలు, ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన బ్రోచర్లు, సమాచారాన్ని కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్‌కు అందిస్తే డిస్‌ప్లే చేస్తారని తెలిపారు. ప్రతి కార్యాలయంలో అధికారి, సిబ్బందికి సంబంధించి వారి పేరు, హోదాతో కూడిన నేమ్ ప్లేట్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శిక్షణ, రవాణా, బ్యాలెట్ పేపర్ల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను అదనపు కలెక్టర్ దాసరి వేణు బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్ వద్ద బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఇక్కడ పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ, తహసీల్దార్ రాజయ్య, సీఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి

గోదావరిఖని, ఫిబ్రవరి 5: పట్టణంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ బుధవారం హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కరీంనగర్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌లోని హోల్‌సేల్ వ్యాపారులతో హమాలీల కూలి రేట్ల ఒప్పందం 2019తో ముగిసినా తిరిగి ఒప్పందానికి వ్యాపారులు స్పందించడం లేదని విన్నించారు. స్పందించిన డిప్యూటీ లేబర్ కమిషనర్ హోల్‌సేల్ వ్యాపారులు, హమాలీ వర్కర్లతో సమావేశం ఏర్పాటుకు హామి ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఇక్కడ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్, నాయకులు కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, గాలిపెల్లి సతీశ్, బండారి రవి, ఆవుల ఐలయ్య, జానీ మియా ఉన్నారు.

వారసత్వ ఉద్యోగాల కోసం పోరుయాత్ర

- గోలేటి నుంచి కొత్తగూడెం వరకు పాద, పోరు యాత్ర
- మంథనికిలో మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

డిపెండెంట్స్ ఉద్యోగ బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 5: వారసత్వ ఉద్యోగాల కోసం సింగరేణి కార్మికుల పిల్లలు పోరుబాట పట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వారసత్వ ఉద్యోగాలను రద్దు చేయగా, స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సింగరేణిలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న విషయం విధితమే. సింగరేణి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో తండ్రి ఉద్యోగం కుమారుడికే అనే నినాదంతో వారస్వత ఉద్యోగాలను ప్రవేశ పెట్టారు. ఈ నిర్ణయంతో ఎంతో మంది కార్మికుల పిల్లలకు సింగరేణి ఉద్యోగాలు వచ్చాయి. కొంత మంది కార్మికుల పిల్లలకు మారుపేర్లు, విజిలెన్స్, పెండింగ్ కేసుల వంటి సమస్యలతో ఉద్యోగాలు రాలేదు. గతంలోనే మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐదు జాతీయ సంఘాలు ఒప్పందం కుర్చుకున్నాయి. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సమయంలో సైతం ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి భూపాలపల్లిలో జరిగిన ఎన్నికల సభలో డిపెండెంట్స్ ఉద్యోగాల కోసం సింగరేణి కార్మికులు, వారి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వారస్వత ఉద్యోగాల సమస్యలకు పరిష్కారం చూప డం లేదు. దీంతో దాదాపు 2వేల మంది వరకు వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. బాధితులు సింగరేణి అధికారులను కలిస్తే తాము చేసేది ఏమి లేదని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలంటు న్నారని చెబుతున్నారు. తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ సింగరేణి కారుణ్య నియా మకాల్లో డిపెండెంట్స్ ఉద్యోగ బాధితులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి నుంచి చలో కొత్తగూడెం పోరు యాత్రను ఈ నెల 2న ప్రారంభించారు. పట్టణాల్లో పాదయాత్ర అనంతరం పోరు యాత్ర కొత్తగూడెంకు ఈ నెల 10లోగా చేరుకోనున్నారు. ఈ పోరుయాత్రలో ఆయా పట్టణ కేంద్రాలు, ప్రధాన చౌరస్తాలో తమ సమస్యలు వినిపించడంతో పాటు 11ఏరియాల్లోని జీఎంలకు వినతి పత్రాలు అందించనున్నారు.

మద్దతు ప్రకటించిన పుట్ట మధూకర్

డిపెండెంట్స్ ఉద్యోగ బాధితులు చేపట్టిన పాద, పోరుయాత్రకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మద్దతును ప్రకటించారు. మంథనిలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులను కలిశారు. వారితో కలిసి నిరసన తెలిపారు.

మా సమస్యలు పరిష్కరించాలి

మా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలి. ఎన్నికల సమయంలో అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి భూపాలపల్లి సభలో మా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాల కోసం ఎన్ని సార్లు సింగరేణి అధికారుల దగ్గరికి వెళ్లినా ఫలితం లేకుండా పోతున్నది. తాము చేసేది ఏమి లేదని, ప్రభుత్వం జీవో విడుదల చేయాలని మాకు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం మా గురించే పట్టించుకోడం లేదు. మా తండ్రులకు చదువు రాదు. ఆ కాలంలో క్లర్కులు ఏం పేరు చెబితే అదే పేరు మీద బాయిలో దిగి పని చేసింద్రు. అప్పుడు అధికారులు చేసిన తప్పులకు ఇప్పుడు మేము బాధ పడుతున్నాం. మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ పోరుయాత్రకు శ్రీకారం చుట్టాం. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

-లక్కశ్రావణ్, సింగరేణి కారుణ్య నియామకంలో డిపెండెంట్స్ ఉద్యోగ బాధితుడు

కాంగ్రెస్‌వి దొంగ హామీలు

- మేనిఫెస్టోలో అమలులో పూర్తిగా విఫలం
- సింగరేణి కార్మికులను మోసం చేసిన చరిత్ర టీడీపీ, కాంగ్రెస్ పార్టీలది
- వారసత్వ ఉద్యోగాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఫిబ్రవరి 5: దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు వాటిని అమలు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మారుపేర్లు, విజిలెన్స్, పెండింగ్ కేసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కారుణ్య నియామకంలో డిపెండెన్స్ ఉద్యోగ బాధితులు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి నుంచి చలో కొత్తగూడెం వరకు ప్రారంభించిన పోరుయాత్ర బుధవారం మంథనికి చేరుకున్నది. ఈ సందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే మధూకర్ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులను మోసం చేసిన చరిత్ర టీడీపీ, కాంగ్రెస్ పార్టీలదేనన్నారు. మళ్లీ అదే తంతును రేవంత్‌రెడ్డి సర్కారు కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కారుణ్య నియామకాలను తొలగించిందన్నారు. స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల కింద ఎంతో మందికి ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో భూపాలపల్లిలో కారుణ్య నియామకాలకు సంబంధించి మారు పేర్ల సమస్యపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఇది ఎంత ముచ్చట అని మాట్లాడారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సింగరేణి వారసత్వ ఉద్యోగాల బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజుగౌడ్, కాయితి సమ్మయ్య, శంకెసి రవీందర్, ఆకుల రాజుబాపు, డిపెండెన్స్ ఉద్యోగ బాధితులు లక్క శ్రావణ్, పొన్నం వెంకటేశ్, తిరుమల్, రాజు, సందీప్, సంతోష్ పాల్గొన్నారు.

'కుంభమేళా'కు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, ఫిబ్రవరి5: ప్రయాగ రాజ్‌లోని మహా కుంభమేళాకు భక్తుల రద్దీ దృష్ట్యా తిరుపతి -దానాపూర్ మధ్య 4 ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఈనెల 14న తిరుపతి -దానాపూర్, 17న దానాపూర్ -తిరుపతి, 18న తిరుపతి - దానాపూర్, 21న దానాపూర్ -తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ ఈ రైళ్లకు పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా: నా క్లయింట్ Sri. Syed Asrar S/o.Syed Zafar గారు, రంగంపల్లి, V/o.పెద్దపల్లి మండలంలో గల Plot No. 16 in Sy.No.38 కి సంబంధించిన 166.66 Sq. Yards గల ఆస్తిని Sri. Sudamalla Amresh S/o. Srinivas గారి వద్ద నుండి Regd. Sale Deed No.1413/2024 Dt:04-04-2024 ద్వారా కొనుగోలు చేసి ఉంటిరి. Sri. Sudamalla Amresh S/o. Srinivas నాక్లయింట్ Sri. Syed Asrar S/o. Syed Zafar గారికి Registration సమయమున All Original లింక్ డాకుమెంట్లను స్వాధీనపరిచి ఉంటిరి. కానీ లింక్ డాక్యుమెంట్ Original Regd. Sale Deed No.147/2002 Dt:21-01-2002, ధర్మారం Village కి Bike పై పోవుచుండగా తేదీ:05-01-2025 నాడు ఎక్కడో పడిపోయి ఉన్నది. దీనికి సంబంధించి నా క్లయింట్ పోలీస్ స్టేషన్ ధర్మారం నందు కూడా కంప్లైంట్ చేసి ఉంటిరి కావున Original Link Document No.147/2002 Dt:21-01-2002 ఎవరికైన దొరికినచో దిగువ తెలుపబడిన అడ్రస్‌కి 7 రోజులలో అందచేయగలరు.

ఇట్లు: Sd/- ఎస్.వి. రమాదేవి, అడ్వకేట్
ఫ్లాట్ నెం.503, ఆదిత్య టవర్స్, శంకర్ గంజ్, పెద్దపల్లి సెల్ : 9963151859

లక్ష్మీనగర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

ఆగని కూల్చివేతలు.. ఖాళీ చేస్తున్న వ్యాపారులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 5: రామగుండం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం కొనసాగుతుంది. గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లోని బాలాజీ స్వీట్‌హౌస్ ప్రాంతంలో రోడ్ల వెడల్పు కోసం అడ్డుగా ఉన్న భవనాల కూల్చివేతలు బుధవారం కూడా కొనసాగింది. గతంలో ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా కూల్చివేస్తుండగా, కొన్ని భవనాల యజమానులు ఎక్కువ ఆస్తినష్టం జరగకుండా ఉండేందుకు తామే ముందుకు వచ్చి స్వచ్ఛందంగా మార్కింగ్ ఉన్న వరకు కూల్చివేసుకుంటున్నారు. ఈ కూల్చివేతలతో గత్యంతరం లేక వ్యాపారులు షాపులు ఖాళీ చేస్తున్నారు. నిత్యం వినియోగదారులతో సందడిగా కనిపించే ఆ ప్రాంతం బుధవారం బోసిపోయి కనిపించింది. కూల్చివేతల మూలంగా భవనాల శిథిలాలు ఎక్కడికక్కడే చెల్లాచెదురుగా రోడ్లపైనే కుప్పలు కుప్పలుగా పడిపోయి ఉన్నాయి. దీంతో అటువైపుగా రాకపోకలు నిలిచిపోయాయి. రామగుండం కార్పొరేషన్‌లో మాస్టర్ ప్లాన్ అమలు చేసి నగరాన్ని విస్తరించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉం దని, ఉన్న చోటనే భవనాలు కూల్చి రోడ్లు వెడల్పు చేయడం ఏమిటని పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

ర్యాలీలో లయన్స్ క్లబ్ సభ్యులు, అధికారులు

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ధర్మారం,ఫిబ్రవరి5: లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ భూతానికి కారణమవుతున్న ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని క్లబ్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్, ఎంఈవో ప్రభాకర్, పీహెచ్‌సీ డాక్టర్ అనుదీప్, క్లబ్ ఆర్సీ తన్నీర్ రాజేందర్, జడ్సీ డాక్టర్ కామని శ్రీనివాస్, డీసీ సామ ఎల్లారెడ్డి, రీజినల్ కార్యదర్శి పుచ్చకాయల మునీందర్, క్లబ్ వీపీ ఇప్ప మల్లేశం, కార్యదర్శి అబ్దుల్ ముజాహిద్, కోశాధికారి కట్ట రమేశ్, పీఆర్‌వో విట్ట రవి, సభ్యులు కుంట రాజు, ఈగం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలతో కందుల సంధ్యారాణి

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో ఖని చిన్నారుల సత్తా

కోల్‌సిటీ, ఫిబ్రవరి 5: తమిళనాడులోని మధురైలో ఇటీవల జరిగిన 24వ జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్-2025 పోటీల్లో గోదావరిఖని ఎస్‌టీకే అకాడమీకి చెందిన చిన్నారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో గోదావరిఖని నుంచి శ్రీనిధి, గీతిక్ జైన్, సాయి రషితలు గోల్డ్ మెడల్స్ సాధించారు. సహస్ర, లక్కీ, హంసబ్ సాదీప్ (సిల్వర్), అబ్దుల్ మాలిక్ (రజత), అక్షయ సాయి, అకీరా నందన్ బ్రౌన్ మెడల్స్ సాధించారు. వీరిలో అకీరా నందన్, సాయి రషిత ఇండోనేషియాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలు బుధవారం గోదావరిఖనికి చేరుకోగా, బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం నగరంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించగా విజేతలకు స్థానికులు నీరాజనాలు పలికారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOSS OF RC

★I CHILUKA HARISH, S/o. MURALIDHAR, R/o. Vidya Nagar, Karimnagar, my original RC No: "TS02FD6414" Motorcar was Lost. If found anyone Cont: 8125948101.
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు

గోదావరిఖని : నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎఫ్‌టీయూ, రైతుకూలీ సంఘం నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక వైఖరిపై కార్మిక సంఘాల పిలుపు మేరకు నగరంలోని పైలాన్ చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఐ కృష్ణ, మెరుగు చంద్రయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మిక, వ్యవసాయ రంగాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించి అమలు చేయాలని, 8గంటల పనిదినం పరిరక్షించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని దినాల అమలు, రోజువారి కూలీ రూ. 600 చెల్లింపుపై బడ్జెట్‌లో పొందుపరుచాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ నాయకులు వెంకన్న, ఈ నరేశ్, బీ అశోక్, కే మల్లేశ్, ఐ రాజేశం, దుర్గయ్య, రాజేందర్, కొమురయ్య, రవికుమార్, రమేశ్, ప్రసా ద్, ఎల్లయ్య, మొండయ్య, సాంబయ్య అన్వేశ్ ఉన్నారు.

ఎన్టీపీసీలో నల్లా బ్యాడ్జీలతో నిరసన

జ్యోతినగర్, ఫిబ్రవరి 5: బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని యాజమాన్యంను డిమాండ్ చేశారు. ఇక్కడ కార్మిక సంఘాల నాయకులు నాంసాని శంకర్, దండ రాఘవరెడ్డి, నాగభూషణం, రాజమల్లయ్య, చందర్, భూమయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పోరాటాలు ఉధృతం చేస్తాం..

మంథని, ఫిబ్రవరి 5: మంథనిమున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం రైతు ఉద్యమాలను పరిగణనలోకి తీసుకోకుండా, కనీస మద్దతు ధర చట్టం చేయడం లేదని, బడ్జెట్‌లో వ్యవసాయానికి అతి తక్కువ నిధులు కేటాయించి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయ త్నం చేస్తున్నదని మండిపడ్డారు. నాయకు లు బూడిద గణేశ్, తిరుపతి, చిప్పకుర్తి చందు, ఆర్ల సందీప్, గొర్రెంకల సురేశ్, అశోక్, శేఖర్, భాగ్య, పోచమ్మ పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి5: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా కాల్వశ్రీరాంపూర్ లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుదవారం ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను వీడాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, నాయకులు చల్ల రాజయ్య, కలవేన గట్టయ్య, మహేశ్, కొమురయ్య, పాల అంజయ్య, ప్రేమ్‌కుమార్, రవి ఉన్నారు.

మంథని : నిరసన తెలుపుతున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్ : సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాధిత కుటుంబాలకు సాయం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 5: కిష్టంపేట ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక స్వీపర్‌గా పని చేస్తున్న బండి మధునయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి పలువురు ఉపాధ్యాయులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. అదే పాఠశాలలో ఇదివరకు పని చేసిన, ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, వివిద ప్రాంతాల ఉపాధ్యాయులు కలిసి రూ. 35,600 కుటుంబ సభ్యులకు అందించారు. ఇక్కడ ఎంఈవో మహేశ్, హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సాయం అందజేత

జూలపల్లి, ఫిబ్రవరి 5 : కుమ్మరికుంటకు చెందిన మార్క రమేశ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేలు అందజేశారు. ఇక్కడ మాజీ ఎంపీపీ విశారపు వెంకటేశం, మాజీ సర్పంచ్ మేచినేని సంతోష్ రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమ్మడవేని మల్లేశం, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుంట రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కొత్త శ్రీధర్, నల్లతీగల సతీశ్, ఆవుల గోపాల్, కొప్పుల శ్రీధర్, కొప్పుల అజిత్, కందుల లచ్చయ్య, కుంట రాజిరెడ్డి, సూర యోసఫ్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు టీవీ వితరణ

టీవీ అందజేస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

కమాన్‌పూర్, ఫిబ్రవరి 5 : గుండారం పంచాయతీ పరిధి రాజాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)కు గ్రామానికి చెందిన రిటైర్డు (నీటిపారుదల శాఖ) ముకుంద రాజన్న రూ. 15వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని ఎంఈవో విజయ్ కుమార్ ద్వారా అందజేశారు. బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు కూడా ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులతో పోటీ పడాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ప్రత్యేక బోధన చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి టీవీ అందజేసిన ముకుంద రాజన్నను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ ఆవునూరి లలిత, హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయురాలు బీ మమత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్యాయం జరిగితే సహించేది లేదు

మంథని, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఎస్సీ వర్గీకరణ రిపోర్టును పూర్తిగా ఖండిస్తున్నామని, మాలలకు అన్యాయం జరిగితే సహించేది లేదని మంథని నియోజకవర్గ జాతీయ మాల మహానాడు నాయకులు కొవ్వూరి రాజలింగు, బండారి సమ్మయ్య పేర్కొన్నారు. బుధవారం వారు మంథనిలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రకటించిన వర్గీకరణ అంశాన్ని పున: సమీక్షించకుండా ఏక పక్షంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి తమకు అన్యా యం చేస్తే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం మాలల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. 75 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటున్న మాలలను విస్మరించడం బాధాకరమన్నారు.

ఆర్థిక సాయం

మంథని రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని గాజులపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో చదివే పిల్లలకు స్టడీ మెటీరియల్స్ కొనుగోలుకు బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన వేల్పుల రాజవ్వ జ్ఞాకార్థం ఆమె సోదురుడు వేల్పుల సమ్మయ్య రూ. 3వేలు, మాజీ సర్పంచ్ కారెంగుల సుధాకర్ రూ. 1000 స్టడీ మెటీరియల్ కొనుగోలు కోసం అంగన్‌వాడీ టీచర్ సునీతకు ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సర్వే

కమాన్‌పూర్: పెంచికల్ పేటలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 5 : మండలంలోని పెంచికల్‌పేటలో గల రెండు వాగులపై నాలుగు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సంబంధించి ఇరిగేషన్ అధికారులు బుధవారం సర్వే చేశారు. ఇటీవల సింగరేణి ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్యకు సింగరేణి ప్రభావిత గ్రామమైన పెంచికల్‌పేట వాగులపై చెక్ డ్యామ్‌లు నిర్మించి రైతులకు సాగు నీటి ఇక్కట్లు దూరం చేయాలని పల్లె నారాయణ వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జీఎం చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఇరిగేషన్ అధికారులు పెంచికల్‌పేటలోని యాపలవాగుపై రెండు చోట్ల, మద్దల వాగుపై మరో రెండు చోట్ల చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదిత స్థలాలను గుర్తించారు. వీటి నిర్మాణాలకు సంబంధించిన అంచనా వ్యయాలను రూపొందించే సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు నివేదికను సింగరేణి అధికారులకు సమర్పించనున్నారు. ఆ తదుపరి నిధులు మంజూరు కోసం సింగరేణి ఆర్జీ-2 అధికారులు సింగరేణి యాజమాన్యానికి నివేదిక అందజేనున్నారు. సింగరేణి సంస్థ ప్రభావిత గ్రామంతో పాటు పునరావాస కాలనీల ఏర్పాటైన గ్రామంగా గుర్తింపు కలిగి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో నూటికి నూరు శాతం సింగరేణి సంస్థ పెంచికల్‌పేట గ్రామంలో గల వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే అవకాశాలు ఉనాయి. ప్రభావిత గ్రామ రైతులకు సాగు నీటి కష్టాలు తొలగించేందుకు కృషి చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి పల్లె నారాయణ రైతుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జక్కా ప్రవీణ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిప్ప సదానందం, లష్కర్లు నారాయణ, రాజేందర్, రైతులు పల్లె నారాయణ, సిరవేన రాజు, డబ్బెట లింగయ్య, కొలిపాక పోచాలు, నూనె నర్సింగం తదితరులు పాల్గొన్నారు.